# యాదగిరి గుట్ట ప్రయాణం

-ఇలపావులూరి మురళీ మోహనరావు



రేపు గురువారం మా ఆవిడకు కూడా సెలవు కలిసొచ్చిందోయ్. ఎక్కడి కైనా ఏభై, అరవై కిలో మీటర్ల దూరంలో ఉన్న పుణ్యక్షేత్రానికి అలా సరదాగా వెళ్ళి రావాలనుకుంటున్నాం." చెప్పాడు వెంకట్రావు.

"చాలా మంచి ఆలోచనోయ్. సెలవు రోజున ఊరికే ఇంట్లో కాళ్ళు బార్లా జాపుకుని ఒకరి ముఖాలు ఒకరు చూసుకునేకంటే అలా ప్రశాంతంగా, చల్లని స్వచ్ఛమైన గాలిలో, ప్రకృతి అందాలను వీక్షిస్తూ షికారుగా భార్యతో వెళ్ళడం అన్నది మహా ప్రశస్తమైన ఆలోచన బాగుంది." జరదా కిళ్ళీ నములుతూ అన్నాడు కొలీగ్ జగన్నాథం.

"ఎక్కడికి వెళ్దామా అని రాత్రంతా ఆలోచించాం. చాలాసేపు డిస్కస్ చేశాం. కానీ ఏమీ నిర్ణయం తీసుకోలేక పోయాం."

"అహా! ఏవేం డిస్కస్ చేశారో?"

"నాకేమో కీసర గుట్ట వెళ్ళే ఆలోచన ఉంది. కళ్ళు చెదిరిపోయే ప్రకృతి, చక్కని ఘాట్ రోడ్డు, స్కూటర్ మీద వెళ్తుంటే ఎంత మజాగా ఉంటుంది. కానీ మా ఆవిడేమో యాదగిరిగుట్టకు వెళ్దాం అంటుంది."

"ఐ. సీ.... చూడు వెంకట్రావ్! ఇదిగో.. ఈ ఇరవై రూపాయలు ఉంచుకుని మూడు లడ్లు నాకోసం తీసుకుతా. యాదగిరి గుట్ట లడ్లు భలే రుచిగా ఉంటాయి." పర్సులోంచి నోటు తీస్తూ అన్నాడు జగన్నాథం.

వెంకట్రావుకు కోపం వచ్చింది.

"అంటే నీ ఉద్దేశ్యం? మేమింకా ఏ నిర్ణయమూ తీసుకోలేదని చెబుతున్నా కూడా యాదగిరి గుట్టకు వెళ్తామని నీవెలా నిర్ణయించావు?" అన్నాడు.

"మీ ఆవిడ యాదగిరి గుట్ట అన్న తరువాత ఇక నీ నిర్ణయం నా నిర్ణయ మంటూ ఒకటుంటుం దోయ్ నీ అజ్ఞానం కానీ! పాతికేళ్ళ సంసార జీవితం గడిపిన అనుభవం నాది. నిన్నగాక మొన్న రథమెక్కిన బచ్చావు. లడ్లు మాత్రం మర్చిపోకు సుమా." ఫైల్లో తలదూర్చేస్తూ అన్నాడు జగన్నాథం.

వెంకట్రావు పళ్ళు పట పట కొరుక్కున్నాడు.

*  *  *

"కీసర మహా గొప్ప పుణ్యక్షేత్రమోయ్ సుందూ. సాక్షాత్తు శ్రీరాముల వారు సతీసమేతంగా రామలింగేశ్వర స్వామి వారిని ప్రతిష్టించారు. కోటి లింగాలు తెస్తున్న హనుమంతుల వారు కోపంతో విసిరివేయగా చెల్లా చెదురుగా పడి ఉన్న శివలింగాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. కొంచెం దూరంలో సీతమ్మవారు స్నానం చేసిన పుష్కరిణి, వేద పాఠశాల.... ఆహా! అక్కడికి వెళ్తే ఎలా ఉంటుందంటావ్?" కాఫీ గుటకలేస్తూ అన్నాడు వెంకట్రావు.

ఎదురుగా మరో కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతున్నది సుందరి.

"నిజమే అనుకోండి. యాదగిరి లక్ష్మీ నృసింహ స్వామి స్వయంభువు. చెంచులక్ష్మితో కలిసి యాదగిరి గుహలో వెలిశాడు. కిలో మీటర్ ఘాట్ రోడ్డు, కొండ మీది నుంచి కను చూపు మేర పచ్చని ప్రకృతి, కాటేజీలు, కోతులు ఓహ్! వర్ణించ వీలుకాదు. పైగా ఓ గంటన్నర ప్రయాణం చేసినట్లుంటుంది." కనుకొనలతో చూస్తు అన్నది సుందరి.

"యాదగిరి గుట్ట ఎప్పుడైనా వెళ్ళొచ్చులేవోయ్.... కీసర"

"కీసర మాత్రం ఎప్పుడైనా వెళ్ళకూడదా ఏం?"

"అబ్బ.... నీ వాదనే నీది కదా!"

"మీ వాదన మీది కాదూ.... మగాడన్న వాడు పెళ్ళాం కోరిక తీర్చాలి.

"పెళ్ళాం అన్నది కూడా మొగుడి కోర్కెలను తీర్చాలి."

"తీర్చే వేళల్లో తీరుస్తూనే ఉన్నాం. పెళ్ళాం ఒక్క కోరిక తీర్చమంటే నామోసీ.... హుం...." కోపంగా లేస్తూ అన్నది సుందరి.

జగన్నాథం మాటలు నిజం కాక తప్పదేమో అనిపించింది వెంకట్రావుకు.

రాత్రి తొమ్మిదయింది. వెంకట్రావు కడుపులో ఎలుకలు పరిగెత్తుతున్నాయి. అలక పాన్పు మీది నుంచి సుందరి లేచే సూచనలు కనిపించడం లేదు.

ఇక లాభం లేదని వంటగదిలోకి దూరాడు. తను వంట చేస్తున్నప్పుడు ఎవరైనా వచ్చి చూస్తే బాగుండదని కాంపౌండ్ గేటుకు తాళం వేసి ఇంట్లో తలుపు కూడా వేశాడు.

కుక్కర్లో బియ్యం, కూర పడేశాడు. సుందరి అంతా గమనిస్తూనే ఉంది. తనను బ్రతిమలాడకుండా భర్త స్వయంగా వంట చెయ్యబూనడం సుందరి కోపాన్ని పెంచింది.

"సుందూ.... సుందూ....." చక్కిలిగిలి పెడుతూ పిలిచాడు వెంకట్రావు.

"ఛీ. ఛీ.. నాతో మాట్లాడకండి. నాకు ఆకలి లేదు" విసుక్కుంది.

"ఇలా అలగడం బాగాలేదు. కావాలంటే అన్నం తిని అలుగు. చచ్చేట్లు వంట చేశాను."

"హు! ఒక్క పూట గుప్పెడు బియ్యం కుక్కర్లో పడేసి చచ్చేట్లు వంట చేశార్ట. మరి రోజూ రెండు పూటలు చేస్తున్నప్పుడు మా చావు తెలియడం లేదా?"

"ఆడదానికది సహజం."

"అదిగో...ఆ చిన్న చూపే పనికి రాదంటాను. మీరు పెద్ద మగాళ్ళు. అసలీ వంట పని మొదట్నుంచీ మగాడిదే. నలుడెవడు? భీముడెవడు?"

"వాళ్ళెవరో నాకు తెలీదు కానీ అసలు డ్యాన్సు మాది. నటరాజు మా మగాడు. మా దగ్గర్నుంచి డ్యాన్సింగ్ లాగేసి మీ ఆడాళ్ళు పెద్ద డ్యాన్సర్లుగా పేర్లు తెచ్చుకుంటూ మమ్మల్ని కీలు బొమ్మల్లాగా తైతక్క లాడిస్తున్నారు."

"ఛీ.... నీతో మాట్లాడటం నా బుద్ధి తక్కువ."

"పళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు. పిచ్చి పిచ్చిగా మాట్లాడితే చెప్పు తీసుకుని కొడతాను."

"హుం.... ఏదీ కొట్టండి చూద్దాం. పెళ్ళాం మాట చెల్లించలేరు కానీ కొట్టడానికి మాత్రం తయారు."

ఇక తను కొంచెం తగ్గడమే మంచిదనిపించింది వెంకట్రావుకు. జగన్నాథానికో నమస్కారం పెట్టాడు. ఎంత అనుభవంతో చెప్పాడో కదా పుణ్యాత్ముడు!

"సరే... మనం యాదగిరి గుట్టకే వెళ్తున్నాం" డిక్లేర్ చేశాడు.

అంతే!

అంతవరకూ కైకేయిలా మంచానికి కరుచుకున్న సుందరి మాయలేడిలా చెంగున లేచింది.

"మీరెందుకు చేశారండీ వంట? నేనున్నాగా" గోముగా అన్నది.

ఎంతైనా సుందరి అందమే వేరు.

స్కూటర్ మీద రివ్వున అరవై కిలో మీటర్ల స్పీడులో వెళ్ళసాగారు సుందరి వెంకట్రావులు. చల్లని గాలి వేగంగా తగులుతుంటే బలే హాయిగా ఉంది.

సేమ్యా ఫ్యాక్టరీ రాగానే బండి ఆపి ఒక చెట్టు కింద నిలుచుని హాట్ ప్యాక్‌లోంచి తీసి వేడి వేడి ఇడ్లీ తిన్నారు.

"ఆహా! జానా బెత్తెడు కొంపల్లో ఊపిరాడక ఆవురావుమని ఎంత తింటే ఏం లాభం? ఇలా ఊరి బయట

విశాలమైన ప్రకృతి ఒడిలో ఇలా వేడి వేడిగా తింటుంటే ఎంత హాయిగా ఉంది!" పరవశంగా అన్నది సుందరి.

"అవును. ఇలా ఆరు బయట ఏ పరిధులూ లేకుండా తిరుగుతాయి కాబట్టి పశువులు గడ్డి సైతం తిని మనకంటే ఎంతో బలంగా ఉంటాయి. పోషకాహారం, సమతులాహారం అంటూ ఈ స్పెషలిస్టులు అవి తినాలి ఇవి తినాలి అని పిచ్చి పిచ్చి కబుర్లు చెబుతుంటారు కానీ ఎద్దులకు, బర్రెలకు, దున్నపోతులకు ఈ ఆహార శాస్త్రం అసలు తెలుసునా? ఏ గడ్డంటే ఆ గడ్డి కరిచి ఎంత బలుస్తున్నాయి!" అన్నాడు వెంకట్రావు.

"అది సరే కానీ ఎక్కడికైనా వెళ్ళినపుడు కోపం కొంచెం తగ్గించుకోవాలి మీరు. ముందు వెనక చూడకుండా ఎవరంటే వాళ్ళతో తగాదాలు పెట్టుకోకండి. అనవసరంగా ఎవరితో మాట్లాడకండి." జాగ్రత్తలు చెప్పింది సుందరి.

"నేను మాత్రం ఊరికే ఎందుకు గొడవలు పడతానోయ్. కానీ కళ్ళ ముందు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోలేం కదా? మొన్న సినిమా హాల్లో గేట్ కీపర్‌తో పోట్లాటకు దిగానంటే మరి వాడు కౌంటర్ ఫాయిల్ ఇవ్వకుండా దాచుకుంటున్నాడు. అవే టిక్కెట్లు మరి కొంత మందికి అమ్మి డబ్బు చేసుకుంటున్నాడు. గవర్నమెంటుకు ఎంత నష్టం?" అన్నాడు వెంకట్రావు.

"ఏమైనా అన్ని వేళలు మనవి కావు." అన్నది సుందరి.

* * *

పదకొండు గంటలకు యాదగిరి గుట్ట చేరారు. ఘాట్ రోడ్డు మీద మెలికలు తిరుగుతూ పోతుంటే భలే థ్రిల్లింగ్ అనిపించింది.

కొండపైన జన సంచారం పెద్దగా లేదు. పార్కింగులో స్కూటర్ నిలిపాడు.

పార్కింగ్ గుమాస్తా వచ్చి టోకెన్ ఇచ్చాడు. గోడ మీద రాసి ఉన్న ప్రకారం రెండు రూపాయలిచ్చాడు వెంకట్రావు.

"సార్... ఐదు రూపాయలు." చెప్పాడు గుమాస్తా.

"అక్కడ రెండు రూపాయలే అని ఉంది కదయ్యా?"

"కానీ టోకెన్ మీద ఐదు రూపాయలు రాశాను చూడండి."

"అలా ఎలా రాస్తావ్? దేవస్థానం వాళ్ళు నీకిచ్చిన కాంట్రాక్టు రెండు రూపాయలే. ఐదు రూపాయలెలా వసూలు చేస్తావు?" కోపంగా అన్నాడు వెంకట్రావు.

"అవన్నీ మీకు అనవసరం. ముందు రూపాయలివ్వండి." పెడసరంగా అన్నాడతను.

వెంకట్రావ్ కోపం నషాళానికంటింది.

"ఏంట్రా వాగుతున్నావు? రెండు రూపాయలకు కాంట్రాక్టు ఒప్పుకుని ఐదు రూపాయలు వసూలు చేసి ఆ మూడు రూపాయలూ నువ్వు మింగుతున్నావా?" అరిచాడు.

"అడ్జెప్పడానికి నువ్వెవరివయ్యా. ముందు ఐదు రూపాయలిచ్చి బండి పెట్టు." గుమాస్తా మరింత గట్టిగా అర్చాడు.

వెంకట్రావు ప్రాయమొచ్చిన కోడె దూడలా బుసలు కొట్టాడు. వెంకట్రావు కోపం చూసి సుందరి కూడా బెదిరి పోయింది.

"ఉండు.... ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుతో మాట్లాడి నీ అంతు తేలుస్తాను." పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ ఆఫీసు వైపు నడిచాడు.

సుందరి కూడా భర్తను అనుసరించింది.

రిసెప్షన్లో ముగ్గురు వ్యక్తులు కూర్చుని టీలు తాగుతూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ పకపక నవ్వుకుంటున్నారు.

"ఈవో గారున్నారా?" అడిగాడు వెంకట్రావు.

"ఆయన హైద్రాబాద్ వెళ్ళారండీ. చెప్పండి." అడిగాడో వ్యక్తి.

"నా పేరు వెంకట్రావు. హైదరాబాదు నుంచి వచ్చాను. ఇక్కడ పార్కింగ్ ఛార్జీలు ఎంత?" దర్పంగా అడిగాడు వెంకట్రావు ఇంగ్లీషులో.

వెంకట్రావు డ్రెస్సు, అడిగిన విధానం చూసి ఇతను ఆకస్మిక తనిఖీకి వచ్చిన ఏ అధికారో అని అతను కొంచెం తగ్గి మర్యాదగా మాట్లాడసాగాడు.

"స్కూటర్‌కు రెండు, కారుకు ఐదు సార్"

"మరి స్కూటర్‌కు ఐదు రూపాయలు వసూలు చేస్తున్నారేం?"

"అలాగా సార్...." ఆశ్చర్యం నటిస్తూ అడిగాడా వ్యక్తి.

"అంటే మీకు తెలియదా?"

"తెలుసుసార్..... చాలాసార్లు వాళ్ళను హెచ్చరించాం."

"అంటే! హెచ్చరించి వదిలేస్తారన్న మాట. ఎక్కడుంది పుకార్ల డబ్బా?"

"ఉండండి సార్... వాడిని పిలుస్తాను."

"పిలవండి..... భక్తులను దోచుకుంటున్నారు. భక్తులు వేసే దక్షిణలు, చేయించే పూజల వలన వచ్చే ఆదాయంతోనే మీకు జీతాలు వస్తున్నాయి. తెలుసునా?" అరిచాడు వెంకట్రావు.

ఇతను కచ్చితంగా ఎండోమెంట్సు డిపార్ట్ మెంటు ఆఫీసరే అయి ఉంటాడని, చెకింగుకే వచ్చాడని నిర్ణయానికి వచ్చారా ఉద్యోగులు.

"సార్.... ఈ లోపల మీరు అలా అలా తిరిగి రండి. నేను వాడిని పిలిపించి యాక్షన్ తీసుకుంటాను." వినయంగా అన్నాడొక ఉద్యోగి.

"ఏ విషయమూ తేలే వరకూ నేను ఇక్కడి నుంచి కదలను." అన్నాడు వెంకట్రావు.

గంటలు గడుస్తున్నాయి. గుమాస్తా రావడం లేదు. వెంకట్రావు అడిగినప్పుడల్లా ఇదిగో అదుగో అంటున్నారు ఉద్యోగులు.

మూడు గంటలయింది.

"సుందూ.... ఈ లోపల నువ్వు ప్రసాదాలు కొనుక్కుని రా.... నేను వీళ్ళంతు చూస్తాను." అన్నాడు వెంకట్రావు.

"అందరికీ వాటా లుంటాయి. లేకపోతే వాడిని పిలిపించడం ఇంతసేపా?" అన్నది సుందరి.

నాలుగైంది. "సార్... సార్.... రండి." పిలిచాడో ఉద్యోగి.

"ఏరా.... నీ పార్కింగ్ ఫీజు రెండు రూపాయలైతే ఐదెందుకు వసూలు చేశావు? వళ్ళు బలిసిందా? సార్ గనుక కంప్లైంటిస్తే నీ కాంట్రాక్టు ఊడిపోతుంది." గద్దించాడో ఉద్యోగి.

"పొరబాటయింది సార్.... నేనింకా సార్ దగ్గర డబ్బులు తీసుకోలేదు. క్షమించండి సార్..." ప్రాధేయ పూర్వకంగా అన్నాడు పార్కింగ్ గుమాస్తా.

వెంకట్రావు కోపం కొంచెం తగ్గింది.

"వదిలెయ్యండి సార్... పాపం పేదోడు. మరోసారి ఇలాంటి పన్లు చేస్తే వాడి కాంట్రాక్టును పీకేస్తాం." చేతులు నలుపుకుంటూ అన్నాడు గుమాస్తా.

అందరూ దొంగలేనన్న విషయం తెలుస్తునే ఉంది.

"నువ్వు పద. సార్ బండి శుభ్రంగా తుడిచి ఉంచు. మీరు రండి సార్" అన్నాడు గుమాస్తా.

సుందరి వంక చూసి గర్వంతో నవ్వాడు వెంకట్రావు. సుందరి కూడా 'శభాష్' అన్నట్లు చూసింది.

స్కూటర్ స్టాండు వద్దకు వచ్చారు గుమాస్తాలు కూడా.

"సార్.... ఈ విషయం మర్చిపోండి. వాడికి బుద్ధొచ్చింది. మీ బండి వాషింగ్ కూడా చేశారు." అన్నారు ఉద్యోగులు.

"నేను దేనినైనా సహిస్తాను కానీ అన్యాయాన్ని మాత్రం సహించను. ఇదిగో బాబూ... మళ్ళీ వారం రోజుల్లో వస్తా. ఇటువంటివి మళ్ళీ చూశానంటే మినిష్టర్ గార్కి రిపోర్టు చెయ్యవలసి ఉంటుంది." హెచ్చరించాడు వెంకట్రావు స్కూటర్ స్టార్ట్ చేసి.

"హమ్మయ్య..... వీడెవడో విజిలెన్స్ వాడే. బతికి పోయాం." ఊపిరి పీల్చుకున్నారు నలుగురూ.

విజయ గర్వంతో వెంకట్రావు మనసు ఆనందంతో గంతులు వేస్తున్నది. ఒక అన్యాయాన్ని ఎదుర్కొన్నానన్న తృప్తితో కడుపునిండిపోయింది.

"అబ్బ.... మీ ఇంగ్లీషు పవర్ అమోఘం. మీరు మాట్లాడుతున్నపుడు వాడు గజగజ వణికి పోయాడు. ఎక్కడికైనా వచ్చినపుడు ప్రతాపం బాగానే చూపిస్తారు." కాంప్లిమెంట్ చేసింది సుందరి.

"ఈజీట్!" హుషారుగా వేగం పెంచాడు వెంకట్రావు.

కింద ఊళ్లో గాజులు కొనుక్కుంది సుందరి. హోటల్లో భోజనం చేశారు. కిళ్ళీలు వేసుకున్నారు.

"అందరూ మనకెందుకులే అనుకుంటుంటే ఇలాగే చెలరేగిపోతారు వీరు. మీ లాంటి వారు ఒకరూ అలా ఉండకపోతే వీళ్ళను అసలు కంట్రోల్ చెయ్యలేం." అన్నది సుందరి.

పెళ్ళాం అలా పొగుడుతుంటే వెంకట్రావు శరీరం హనుమంతుడి దేహంలా పొంగుతున్నది.

నేషనల్ హైవే మీదికొచ్చారు.

ఇద్దరు యువతులు చేతులెత్తారు. స్కూటరాపాడు వెంకట్రావు.

"సారూ.... తాజా తాజా కల్లు సార్... ముంత పది రూపాయలే" అన్నారు.

"ఛీ.... ఛీ.... కల్లు నేను తాగను వద్దు." అన్నాడు వెంకట్రావు.

"పోనీ అమ్మగారు తాగుతారా? తీస్కోండి సార్."

"యాక్కిరే" ముఖం అసహ్యంగా పెట్టింది సుందరి.

"గదేంటి సార్.... ఐద్రాబాదు నుంచొచ్చి కల్లు తాగకుండా పోతారా?" అన్న దొక యువతి.

"ఏంటీ.... హైదరాబాదు నుండి మేమింత దూరం వచ్చింది కల్లు తాగడానికా?" కోపంగా అన్నాడు వెంకట్రావు.

ఇంతలోనే సుందరి కెవ్వున అరిచింది.

"ఏమైంది?" కంగారుగా అన్నాడు వెంకట్రావు.

"మీ కోపంలో మనం అసలు విషయం మర్చిపోయాం. అసలు మనం గుళ్ళోకి వెళ్ళి స్వామి వారి దర్శనం చేసుకోవడమే మర్చిపోయాం" వణుకుతో అన్నది సుందరి.

తెరిచిన వెంకట్రావునోరు మూతపడలేదు. ❋